ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అనకాపల్లి

జిల్లా వార్తలు

గురువారం 4 జూలై 2024



కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకరణ రేపు


అనకాపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా నియమితులైన కె.విజయకృష్ణన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి బుధవారం రిలీవ్ అయ్యారు. కొత్త కలెక్టర్‌గా విజయకృష్ణన్ జిల్లాకు రానుండడంతో అధికారులు ఇప్పటికే ఆమె చాంబర్‌ను సిద్ధం చేస్తున్నారు. తొలిరోజు బాధ్యతలు స్వీకరించిన వెంటనే కలెక్టర్ జిల్లా ముఖ్య అధికారులతో సమావేశమవుతారని కలెక్టరేట్ ఉద్యోగ వర్గాల ద్వారా తెలిసింది.



కె.విజయకృష్ణన్

విద్యా వ్యవస్థ అతలాకుతలం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తం



మాకవరంపాలెం మండలంలోని వెంకియ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో జిల్లా విద్యాశాఖలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ పాఠశాలల విలీనంతో కొందరు విద్యార్థులు చదువుకు దూరం కాగా, మరికొందరు ప్రైవేటు పాఠశాలల్లో చేరిపోయారు. దీని వల్ల ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. మాకవరంపాలెం మండలంలోని వెంకియ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు గాను ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

- పాఠశాలల విలీన ప్రక్రియతో చదువుకు కొందరు విద్యార్థులు దూరం
- మరికొందరు ప్రైవేటు స్కూళ్లలో చేరిక
- చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు

గత వైసీపీ ప్రభుత్వం 2020-21లో ఉపాధ్యాయుల సన్నద్ధత, విద్యార్థుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒకటో తరగతి నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియా స్కూల్స్‌గా మార్చేసిన సంగతి తెలిసిందే. రెండేళ్ల కిందట జీవో నంబర్ 117ను తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలను సమీపంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. విలీన ప్రక్రియ కారణంగా పలు చోట్ల పాఠశాలలు మూతపడడంతో విద్యార్థులు సమీపంలో ప్రైవేటు పాఠశాలల్లో చేరారు.

పాఠశాలల విలీనంతో అవస్థలు

ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను మూడు కిలో మీటర్ల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో కలిపారు. దీని వల్ల అనేక ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థులు 20 మందిలోపే ఉంటున్నారు. దీంతో పలు పాఠశాలల్లో కొద్దిమంది విద్యార్థులకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఉంటున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు సుముఖత చూపడం లేదు. వైసీపీ ప్రభుత్వం గతంలో తీసుకున్న అనేక స్పష్టత లేని నిర్ణయాలతో విద్యా వ్యవస్థలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ఐటీ, విద్యాశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్ ఇప్పుడిప్పుడే విద్యాశాఖలో అధ్వాన పరిస్థితులను చక్కదిద్దే చర్యలు చేపడుతున్నారు. విలీన ప్రక్రియతో జరిగిన నష్టాన్ని పూరించే దిశగా అడుగులు వేస్తున్నారు. జిల్లాలో గత ఏడాది 24 మండలాల్లో 222 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. దీంతో 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2.21 లక్షల మంది ఉండగా, ఈ సంఖ్య 2023-24 నాటికి 2.19 లక్షలకు పడిపోయింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో కేవలం 2.16 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అంటే గత రెండు విద్యా సంవత్సరాల్లో జిల్లాలో ఐదు వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. బూట్లు, దుస్తులు, బ్యాగులు, పుస్తకాలు ఇస్తున్నా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది తగ్గుముఖం పడుతూనే ఉంది. విలీన ప్రక్రియ వల్ల ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు దూరమవుతున్నారని ఉపాధ్యాయ సంఘాల నేతలు మొర పెట్టుకున్నా గత వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. అనకాపల్లి మండలం మామిడిపాలెం ప్రాథమిక పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో 245 మంది విద్యార్థులు ఉండేవారు. 3,4, 5 తరగతులు విలీనం చేయడంతో 1, 2 తరగతుల్లో కేవలం 11 మంది మాత్రమే విద్యార్థులు మిగిలారు. వీరికి ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అదే విధంగా సుందరయ్యపేట పాఠశాలలో కూడా విద్యార్థుల సంఖ్య కంటే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ రెండు పాఠశాలల్లోనే కాదు, జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో పాఠశాల విలీన ప్రక్రియ కారణంగా 20 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలు అనేకం ఉన్నాయి. అయితే జిల్లా విద్యాశాఖాధికారులు వివరాలు వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారు.

ఐదు తరగతులు.. ఇద్దరే విద్యార్థులు

మాకవరపాలెం: మండలంలోని వెంకియ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు ఉండగా, ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వారికి ఒక ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారు. ఈ పాఠశాలను వేరొక పాఠశాలలో విలీనం చేయడానికి అవకాశం లేక ఇలాగే కొనసాగిస్తున్నారు. అలాగే మల్లవరం ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరికి ఒక ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారు. తాడపాలలో ఇద్దరు విద్యార్థులతోనే పాఠశాల నిర్వహిస్తున్నారు. జి.కోడూరు ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. అలాగే జెడ్.గంగవరం పాఠశాలలో నలుగురు విద్యార్థులు, వెంకటాపురంలో నలుగురు విద్యార్థులు, ముసిడిపాలెంలో ముగ్గురు విద్యార్థులు, బూరుగుపాలెంలో ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో ఒక్కొక్కరు చొప్పున ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలల విలీన జీవోను రద్దు చేయాలి



పాఠశాలలను విలీనం చేసేందుకు గతంలో ఇచ్చిన జీవోను రద్దు చేయాలి. పాఠశాలలు అందుబాటులో లేక విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చేరుతున్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రాథమిక విద్య పల్లె ప్రజలకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్పందించి పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసే 117 జీవోను రద్దు చేసి పాత విధానంలోనే పాఠశాలలను నిర్వహించాలి.

\- గొంది చినబ్బాయ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

తీరనున్న ఇసుక కష్టాలు

- 8 నుంచి కొత్త పాలసీ
- పేదలకు ఉచితంగా ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం
- పాత పాలసీ రద్దుతో జనం హర్షం



(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇకపై ఇసుక కష్టాలు తీరనున్నాయి. ఈ నెల 8 నుంచి కొత్త ఇసుక పాలసీ తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పేదలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని భావిస్తోంది. దీనికి ఇంకా విధి విధానాలు రూపొందించాల్సి ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయనున్నారు. కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసి జిల్లాలో ఇసుక లభ్యత, ఇతరత్రా ఇసుక రవాణా అవకాశాలపై చర్చించనున్నారు. ఇసుక లోడింగ్, రవాణా చార్జీలను నిర్ణయించనున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇసుక అందిస్తే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని పూర్తిగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇసుక తవ్వకాలు, అమ్మకాల బాధ్యతను జేపీ వెంచర్స్ అనే ప్రైవేటు సంస్థకు అప్పగించి ఇసుక సామాన్యులకు అందకుండా చేసింది. అనకాపల్లి జిల్లాలో నదుల్లో ఇసుక నిల్వలు లేని కారణంగా రీచ్‌లకు అనుమతులు ఇవ్వలేదు. శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ఇసుకను జేపీ వెంచర్స్ సంస్థ ద్వారా జిల్లాకు రవాణా చేసి, విక్రయాలు జరిపారు. అనకాపల్లి, నర్సీపట్నం, అచ్యుతాపురం, నక్కపల్లి, చోడవరం మండలాల్లో ఐదుచోట్ల ఇసుక డంపింగ్ యార్డులను ఏర్పాటు చేశారు. జిల్లాకు అవసరమైన ఇసుక నిల్వలను ఆయా డంపింగ్ యార్డుల్లో పెట్టినా కేవలం వైసీపీ నాయకుల అనుచరులకు మాత్రమే ఇసుక రవాణా అయ్యేది. ఆన్‌లైన్ విధానంలో ఇసుక లోడ్‌ల బుకింగ్ విధానం పెట్టి మూన్నాళ్లకే మూలకు చేర్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే గత వైసీపీ ప్రభుత్వం ఇసుకను ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే వనరుగా మార్చేసుకుంది. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలో అనధికార ఇసుక క్వారీలు ఏర్పాటు చేసుకొని వైసీపీ నాయకులే ఇసుక వ్యాపారం చేశారు. జిల్లాలో లారీ ఇసుక లోడ్ సామాన్యులు కొనుగోలు చేయాలంటే రూ.30 వేలు నుంచి రూ.50 వేలు వరకు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇకపై అటువంటి కష్టాలు ఉండవు. అందరికీ అందుబాటు ధరలో ఇసుక అందాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

డ్రగ్స్, గంజాయి నియంత్రణకు 100 రోజుల ప్రణాళిక

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ

- వార్త 5వ పేజీలో..

తెగుళ్లను తట్టుకొనే చెరకు రకాలే మేలు

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 3: ఎర్రకుళ్లు, పసుపు ఆకు తెగుళ్లను తట్టుకొనే చెరకు రకాలను రైతులు వేసుకోవాలని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు సూచించారు. చోడవరం, సంకిలి చక్కెర కర్మాగారాల పరిధిలో ఈ తెగుళ్లకు సులభంగా గురయ్యే రకాలను అధికంగా సాగు చేయడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. అధిక రికవరీని ఆశించి ఈ రకాలను సేద్యం చేస్తున్నారని, అయితే పంట తెగుళ్ల బారిన పడినట్టయితే వచ్చే నష్టం తీవ్రంగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. 2006 ఏ223 వంటి రకాలను సాగు చేయాలని, ఈ రకం తెలంగాణలో ఇప్పటికే 60 శాతంపైగా విస్తీర్ణంలో సాగవుతుందని పేర్కొన్నారు. చోడవరం, సంకిలి చక్కెర కర్మాగారాల యాజమాన్యాలు తెగుళ్లను తట్టుకొనే రకాలనే ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

ఎరువుల ఎంపిక ముఖ్యం

ఖరీదైన రసాయన ఎరువులను ఉపయోగించే కన్నా, చౌకగా లభించే జీవన ... మిగతా 6వ పేజీలో

నేడు విద్యా సంస్థల బంద్


- సెలవు ప్రకటించిన ప్రైవేటు విద్యా సంస్థలు

అనకాపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల బంద్ పాటించాలని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు జిల్లా ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంద్‌కు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు, ఇంజనీరింగ్ కళాశాలలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు జి.రాము, ఎస్‌జే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని, ప్రభుత్వ ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు బంద్ పాటించాలని నోటీసులు అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ నెల 4న జరగాల్సిన ఏయూ సెమిస్టర్ పరీక్షలను రిజిస్ట్రార్ వాయిదా వేస్తూ ప్రకటన చేసినట్టు తెలిపారు.

విప్లవ జ్యోతి అల్లూరి

బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన సీతారామరాజు

నేడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా..



చింతపల్లి, జూలై 3:

బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన విప్లవ వీరుడు.. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ధీశాలి.. అల్లూరి సీతారామరాజు. స్వాతంత్ర్యోద్యమంలో అల్లూరి సాయుధ పోరాటం ఓ చరిత్ర సృష్టించింది. పిన్నవయస్సులో బ్రిటీష్ పాలకుల అకృత్యాలు, దురాగతాలను ఎదురించి, ఆదివాసీలను చైతన్యం చేసి రంప తిరుగుబాటుకు శ్రీకారం చుట్టిన సీతారామరాజు రెండేళ్ల పోరాటంలో బ్రిటీష్ పాలకులకు కంటి మీద కునుకులేకుండా చేశాడు. సకల విద్యాపారంగతుడైన అల్లూరి సీతారామరాజు ప్రజల కోసమే జీవించారు. వారి కోసమే ప్రాణత్యాగం చేశారు. ఆ మహనీయుని 127వ జయంతిని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- ఆదివాసీలపై బ్రిటీష్ అధికారుల అకృత్యాలు
- లంబసింగి ఘాట్ నిర్మాణంలో తక్కువ కూలి ఇచ్చి చిత్రహింసలు
- ఆదివాసీల కోసం విప్లవ వీరుడి అలుపెరగని పోరాటం

అల్లూరి సీతారామరాజు అసలు పేరు శ్రీరామరాజు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామంలోని అమ్మమ్మ ఇంట శ్రీరామరాజు జన్మించాడు. శ్రీరామరాజు తండ్రి అల్లూరి వెంకటరామరాజుది పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లు. ఆయన ఫొటోగ్రాఫర్, గ్రామంలో ఫొటో స్టూడియో నడిపేవారు. 1890లో ఆయన అనకాపల్లి వచ్చి కొంతకాలం ఉన్నారు. అదే సమయంలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ నుంచి బతుకుతెరువు కోసం పద్మనాభం మండలం పాండ్రంగికి వలస వచ్చిన స్థిరపడిన వెంకటరామరాజు కుమార్తె సూర్యనారాయణమ్మతో వివాహం నిశ్చయమైంది. అల్లూరి వెంకటరామరాజు, సూర్యనారాయణమ్మల వివాహం 1895లో జరిగింది. మొదటి కాన్పు కోసం సూర్యనారాయణమ్మ 1896 ఆఖరిలో పుట్టింటికి వచ్చింది. 1897 జూలై 4వ తేదీ సాయంత్రం సుమారు 4:10 గంటలకు పాండ్రంగిలో శ్రీరామరాజు(సీతారామరాజు) జన్మించాడు. శ్రీరామరాజుకి ఏడాది వయస్సు వచ్చాక వెంకటరామరాజు, సూర్యనారాయణమ్మ దంపతులు స్వగ్రామం మోగల్లు వెళ్లిపోయారు. వెంకటరామరాజు, సూర్యనారాయణమ్మలకు 1901లో కుమార్తె సీతమ్మ, 1906లో రెండోవ కుమారుడు సూర్యనారాయణరాజు జన్మించాడు.



కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో సీతారామరాజు విగ్రహం

కలరాతో తండ్రి మృతి


సీతారామరాజు తండ్రి రామరాజు రాజమండ్రిలో స్థిరపడి, ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. 1908లో గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రబలిన కలరా వ్యాధికి గురై వెంకటరామరాజు మరణించారు. సీతారామరాజు ఆరవ తరగతి చదువుతున్న సమయంలో తండ్రిని కోల్పోవడంతో ఆయన జీవితంలో పెనుమార్పు వచ్చింది. స్థిరాదాయం లేక, పేదరికం వల్ల రాజు కుటుంబం స్థిరంగా ఒకచోట ఉండలేక ... మిగతా 6వ పేజీలో



అల్లూరి సీతారామరాజు దాడిచేసిన చింతపల్లి పోలీస్ స్టేషన్



కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో సీతారామరాజు సమాధి



కళకళలాడుతున్న కోనాం జలాశయం

నిండు కుండలా కోనాం జలాశయం

- పెరిగిన నీటిమట్టం
- వృథాగా పోతున్న 20 క్యూసెక్కుల నీరు



దిగువ కాలువ గేటు ద్వారా వృథాగా పోతున్న సాగునీరు

చీడికాడ, జూలై 3: మండలంలో ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో కోనాం జలాశయానికి వర్షపు నీరు చేరడంతో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. మూడు రోజుల క్రితం వరకు జలాశయం ఎగువ అటవీ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో పెరుగుతోంది. అయితే నీటి పారుదలశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సుమారు 20 క్యూసెక్కుల వరకు నీరు దిగువ కాలువ ద్వారా రోజూ వృథాగా పోతోంది. జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, మంగళవారం ఉదయానికి 96.10 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 80 క్యూసెక్కులు కాగా, దిగువ గేటు ద్వారా 20 క్యూసెక్కుల వరకు సాగునీరు వృథాగా కిందకు పోతుంది. కాగా గత ఏడాది ఇదే రోజునాటికి 97.30 మీటర్ల నీటిమట్టం ఉంది. జలాశయానికి కొత్తనీరు చేరుతుండడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

ఆస్తి కోసం ఘాతుకం


అన్నను హత్య చేసిన సోదరులు



మృతుడు సున్నం సతీశ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

గత నెల 27న హతమార్చి ఎస్.రాయవరం మండలంలో పోలవరం కాలువ వద్ద పూడ్చివేత

- అదృశ్యం కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్టు
- మృతదేహం వెలికితీత



మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న అధికారులు

ఎలమంచిలి, జూలై 3: ఆస్తి తగాదాల కారణంగా ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. వరుసకు తమ్ముళ్లు అయిన ఇద్దరు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి సీఐ ఎస్.కె.గఫూర్ బుధవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎలమంచిలి పట్టణానికి చెందిన సున్నం సతీశ్‌కుమార్ బంగారం దుకాణం నిర్వహిస్తున్నాడు. భార్యకు దూరంగా తులసీనగర్‌లో నివాసముంటున్నాడు. కాగా తన కుమారుడు సతీశ్‌కుమార్ ఈ నెల ఒకటో తేదీ నుంచి కనిపించడం లేదని అతని తల్లి రాజా నాగమణి మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదృశ్యం కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ... మిగతా 6వ పేజీలో

క్రైం... crime news

ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.1.5 లక్షల వసూలు

▸ పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

మాకవరపాలెం, జూలై 3 : ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేశారంటూ వజ్రగడ గ్రామానికి చెందిన వంటాకుల రామలక్ష్మి స్థానిక ఎస్‌ఐ రామకృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. వజ్రగడ గ్రామానికి చెందిన తమరాన యర్రన్ననాయుడు స్మార్ట్ విలేజ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి మోసం చేశారని రామలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకోసం తన వద్ద లక్షా 50 వేల రూపాయలు తీసుకొని ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు తీసుకున్న డబ్బులు అడిగితే డబ్బులు ఇచ్చేది లేదని అంటున్నాడని, బెదిరింపులకు పాల్పడుతు న్నారని ఆమె పేర్కొన్నారు. దీనిపై ఎస్‌ఐ మాట్లాడుతూ ఫిర్యాదు నమోదు చేయడం జరిగిందన్నారు. విచారణ చేస్తున్నట్టు చెప్పారు.

బాలకార్మికులతో పనులు చేయించిన యజమానులపై కేసులు

చోడవరం, జూలై 3 : బాల కార్మికులను దుకాణాలలో పనిలో పెట్టుకుంటున్న యజమానులపై కేసులు నమోదు చేస్తున్నట్టు స్థానిక సహాయ కార్మిక అధికారి పి.సత్యనారాయణ తెలిపారు. చోడవరం కార్మికశాఖ పరిధిలోని దేవరాపల్లి, పాడేరు, సబ్బవరం ప్రాంతాల్లో బాలకార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి పనులు చేయిస్తున్న దుకాణాల యజమానులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఆ ముగ్గురు కార్మికులకు న్యాయంగా రావలసిన వేతనాల వ్యత్యాసాన్ని ఆ దుకాణాల యజమానుల నుంచి వసూలు చేసి, తిరిగి ఆయా కార్మికులకు చెల్లించినట్టు తెలిపారు. ఈ విధంగా రూ.24,920లు కార్మికులకు అందజేసినట్టు తెలిపారు. అలాగే కార్మికులను తక్కువ వేతనాలతో పనులు చేయించే యజమానులపై కేసులు నమోదు చేస్తామని సహాయ కార్మిక అధికారి సత్యనారాయణ హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 28 మందికి జరిమానా



వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ పైడపునాయుడు

అనకాపల్లి టౌన్, జూలై 3 : మద్యం సేవించి వాహనాలు నడిపిన 28 మందికి ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ 13వ ఎంఎం కోర్టు జడ్జి బీవీ విజయలక్ష్మి తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.పైడపునాయుడు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 28 మంది పట్టుబడ్డారు. వీరిని 13వ ఎంఎం కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా న్యాయమూర్తి పైవిధంగా జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసిన ద్విచక్ర వాహనదారులు 21 మందిపై కేసులు నమోదు చేసి రూ.9,335 జరిమానా విధించారన్నారు. అనంతరం ఆయన పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను అంతా విధిగా పాటించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టు మృతి

మాకవరపాలెం, జూలై 3 : తామరం పెట్రోల్ బంకు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.



సత్తిబాబు (ఫైల్)

కొత్తపాలెం గ్రామానికి ఏకా సత్తిబాబు (40) బుధవారం సాయంత్రం మాకవరపాలెం గ్రామానికి బైకుపై అతనితో పాటు ఇద్దరు పిల్లలను తీసుకొని బయలుదేరారు. కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా తామరం పెట్రోల్ బంకు వద్ద బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వ్యానును ఢీ కొంది. దీంతో అతను రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయం తగిలింది, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. అతనితో పాటు ఉన్న ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

అప్పుల బాధతో లారీ డ్రైవర్ ఆత్మహత్య

కశింకోట జూలై 3 : కశింకోటలోని భవానీ కాలనీకి చెందిన శిష్టి పరమేశ్వరరావు (48) అప్పుల బాధ తాళలేక ఆయన నివాసంలో బుధవారం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. పరమేశ్వరరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అప్పులు పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు అతని భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు.

పలు రైళ్లు రద్దు...రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 3 : పలాస, విజయనగరం మెయిన్‌లైనులో భద్రత పనులు చేపడుతుండడంతోపలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడంతోపాటు, మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

ఈనెల 5న పలాస-విశాఖ (07471), విశాఖ-పలాస (07470), గుణుపూర్-విశాఖ (085 21), విశాఖ- గుణుపూర్ (08522), విశాఖ-భవానీపట్న (08504), విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ (22820) రద్దు చేశారు. అలాగే, ఈనెల 6న భవానీపట్న- విశాఖ (08503), బ్రహ్మపూర్ - విశాఖ (08531), భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ (22819) రద్దు. ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఈనెల 5న భువనేశ్వర్ - రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ (20896) రెండున్నర గంటలు, టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) గంటన్నర, సంబల్‌పూర్ - నాందేడ్ నాగావళి ఎక్స్‌ప్రెస్ (20809) రెండు గంటలు, సంత్రాగచ్చి - తంబరం ఎక్స్‌ప్రెస్ (16090) మూడున్నర గంటలు, విశాఖ - విజయనగరం మెము (07468) రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయి. అలాగే, ఈనెల 4న ముంబాయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) మూడున్నర గంటలు ఆలస్యంగా వెళ్లనుంది.

సెజ్‌లో కొత్తగా ఏఐ పరికరాల తయారీ కంపెనీ

▸ 'స్మైల్' పేరిట 20 ఎకరాలలో నిర్మాణం

▸ 2028వ సంవత్సరంలో ప్రారంభం

అచ్యుతాపురం రూరల్, జూలై 3 : ఇక్కడి ఎస్‌ఈజెడ్ పరిధిలో నూతనంగా ఏఐ ఉత్పత్తుల తయారీ, విదేశీ ఎగుమతుల కంపెనీని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల సెజ్‌లో సబ్‌స్టాక్ట్ మ్యానుఫ్యాక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంటర్‌ప్రైజెస్ (స్మైల్) పేరుతో ఏపీఐఐసీ ఇప్పటికే ఇరవై ఎకరాల భూమిని కేటాయించింది. చండీఘర్‌కు చెందిన ఈ కంపెనీ యాజమాన్యం సెజ్‌లో రూ.189 కోట్ల పెట్టుబడితో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) పరికరాలతయారీ, విదేశీ ఎగుమతులు చేయనున్నారు. వచ్చే 2028వ సంవత్సరంలోగా కంపెనీ ప్రారంభమై, సుమారు ఐదు వేల మందికి ఉపాధి కల్పించనుందని సంస్థ ప్రతినిధులు ఏపీఐఐసీకి నివేదిక ద్వారా తెలియజేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

కృష్ణాదేవిపేట పార్కులో అల్లూరి జయంతి ఏర్పాట్లు



అల్లూరి పార్కులో పనులు పరిశీలిస్తున్న ఆర్‌డీవో హెచ్‌వీ జయరాం



పార్కులో ముగ్గులు వేస్తున్న వెలుగు అధికారులు, సిబ్బంది

కృష్ణాదేవిపేట, జూలై 3 : కృష్ణాదేవిపేట సమీపంలోని అల్లూరి స్మృతివనంలో గురువారం అల్లూరి జయంత్సోవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి కూలీలతో పిచ్చి మొక్కలు తొలగించారు. వెలుగు అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది, మహిళలు ముగ్గులు వేశారు. అల్లూరి జయంతి ఉత్సవాలకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుతో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. అందులో భాగంగా బుధవారం నర్సీపట్నం ఆర్‌డీవో హెచ్‌వీ జయరాం, గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ తదితరులు జయంతి సభావేదిక పనులు పరిశీలించారు. అలాగే పార్కులో అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్లూరి చరిత్ర కళామందిరాన్ని శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజ్‌భరత్, వెలుగు ఏపీఎం మంగ, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు, అధికారులు అల్లూరి యువజన సంఘం నాయకులు శ్యామల వరలక్ష్మి, లాక్కాకులు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సాయుధ పోరాటానికి సజీవ సాక్ష్యం

బ్రిటీష్ సైనికాధికారుల సమాధులు

▸ అల్లూరి అనుచరుల చేతిలో మృతి చెందిన హైటర్, కవర్ట్‌లు

▸ 1922, సెప్టెంబరు 24న దామనాపల్లి ఘాట్‌లో ఘటన

▸ మృతదేహాలను నర్సీపట్నం తరలించి ఖననం చేసిన బ్రిటీష్ ప్రభుత్వం

▸ 46 సెంట్లు సమాధులు ప్రాంతాన్ని నిషిద్ధ భూమిగా ప్రకటించిన బ్రిటీష్ ప్రభుత్వం

▸ నేడు అల్లూరి సీతారామరాజు జయంతి

నర్సీపట్నం, జూలై 3 : బ్రిటీష్ ప్రభుత్వంపై మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటానికి సజీవ సాక్ష్యంగా నర్సీపట్నంలోని బ్రిటీష్ సైనికాధికారుల సమాధులు నిలుస్తున్నాయి. నేటి తరానికి అల్లూరి సాయుధ పోరాటం గురించి తెలియాలంటే ఈ బ్రిటీష్ సైనికాధికారుల సమాధులు తప్పితే ఇతర ఏ విధమైన ఆధారాలు లేవు. ఇద్దరు బ్రిటీష్ సైనికాధికారులు అల్లూరి అనుచరుల చేతితో మృతి చెందినట్టు పక్కాగా ప్రభుత్వ రికార్డుల్లో కూడా ఉంది. ఈ కారణం వల్లే చారిత్రాత్మకమైన బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల ప్రాంతాన్ని అల్లూరి స్మారక పార్కుగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. అయితే ప్రభుత్వాలు మారుతున్నాయి తప్పితే అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధి అమలులో కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

కొయ్యూరు మండలం శరభన్నపాలెం ఎగువన దామనాపల్లి ఘాట్‌లో అల్లూరి సీతారామరాజు అనుచరులు మాటు వేసి బ్రిటీష్ సైనికాధికారులైన కల్నల్ నైవేలి హైటర్, స్కాట్ కవర్ట్‌లను కాల్చి చంపేశారు. బ్రిటీష్ ప్రభుత్వం హైటర్, కవర్ట్ మృతదేహాలను రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం తరలించి ఊరు శివార్లలో ఖననం చేసింది. గొలుగొండ సంస్థానంలో బ్రిటీష్ ప్రతినిధిగా పని చేస్తూ వయస్సు రీత్యా చనిపోయిన జేబ్స్ గిబ్సన్ మృతదేహాన్ని కూడా ఇక్కడే ఖననం చేశారు. సమాధులు ఉన్న 46 సెంట్లు స్థలాన్ని బ్రిటీష్ ప్రభుత్వం నిషిద్ధ భూమిగా ప్రకటించి పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంది. స్వాతంత్ర్యం అనంతరం సమాధులు చుట్టూ ఉన్న 10 సెంట్లు విస్తీర్ణం గల



నర్సీపట్నంలోని హైటర్, కవర్ట్ సమాధులు

ఖాళీ స్థలాన్ని రెవెన్యూ అధికారులే పట్టాలు ఇచ్చేశారు. మెయిన్ రోడ్డుని ఆనకొని ఉన్న స్థలం కూడా కాలక్రమేణా చాలా వరకు ఆక్రమణకు గురైంది. ఇటీవల మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఆనుకొని ఉన్న ఆక్రమణలు తొలగించారు. రూ.కోట్లు విలువ చేసే సమాధుల స్థలం మళ్లీ ఆక్రమణ జరగకుండా చూడాలని, ఇప్పటికే ఉన్న ఆక్రమణలు తొలగించాలని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు డిమాండ్ చేస్తున్నారు. అల్లూరి స్మారక పార్కుగా అభివృద్ధి చేయాలని కోరారు. చారిత్రాత్మక స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ కమిటీ ప్రతినిధి పీవీ సత్యనారాయణరావు కోరారు.

నేడు కృష్ణాదేవిపేటలో అల్లూరి విగ్రహావిష్కరణ



కృష్ణాదేవిపేట గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అల్లూరి ఫైబర్ విగ్రహం

కృష్ణాదేవిపేట, జూలై 3 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి మైత్రి గ్రం థాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన అల్లూరి నెలువెత్తు విగ్రహాన్ని గురువారం అల్లూరి జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం స్థానిక గ్రంథాలయ కమిటీ సభ్యులు, పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అల్లూరి నెలువెత్తు ఫైబర్ విగ్రహాన్ని ఎంవీ సుబ్బరాజు, దత్ల బుచ్చిరాజు ఆర్థిక సాయంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే విగ్రహాన్ని రాతి దిమ్మెపై ఉంచి టైల్స్ అమర్చారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై అల్లూరికి ఘన నివాళి అర్పించాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

మూడున్నర కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

కశింకోట, జూలై 3 : మండలంలోని నర్సింగబిల్లి శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గంజాయి రవాణా చేస్తున్న విషయం బుధవారం వెలుగు చూసింది. ఈ ఇందుకు సంబంధించి ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలివి. రాజమహేంద్రవరం జిల్లాకు చెందిన వాసంశెట్టి రుద్ర వెంకటదుర్గా మహేష్, గంటి రెశ్వంత్ ఇరువురూ పాడేరులో గంజాయి కొనుగోలు చేసి విశాఖపట్నం నుంచి వయా అనకాపల్లి మీదుగా రాజమహేంద్రవరం తరలిస్తున్నారు.

ఇక్కడి నర్సింగబిల్లి జాతీయ రహదారిపైకి వచ్చేసరికి ముందు వెళుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో వారి వాహనంలోని మూడున్నర కిలోల గంజాయి బయటపడింది. ఈ ఘటనలో గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

డ్రగ్స్, గంజాయి నియంత్రణకు 100 రోజుల ప్రణాళిక

▸ ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గంజాయి రవాణా, ఇతర డ్రగ్స్ నివారణకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని ఎస్పీ కేవీ మురళీకృష్ణ వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం వంద రోజుల ప్రణాళిక అమలుపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్ర, ఒడిశా బోర్డర్‌తో పాటు ఏజెన్సీ ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసుల వివరాలను తెలుసుకున్నారు. కేసుల విచారణపై దిశానిర్దేశం చేశారు. దర్యాప్తు అధికారులు గంజాయి కేసులను ప్రత్యేక శ్రద్ధతో నేరాభియోగ పత్రాలను సంబంధిత కోర్టుల్లో నమోదు చేయాలన్నారు. కేసుల్లో పురోగతిపై సమీక్షలు జరపాలని సూచించారు. ఈ సమావేశంలో అనకాపల్లి, పరవాడ,



పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

నర్సీపట్నం డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, జీఆర్‌ఆర్ మోహన్‌లతో పాటు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న డ్వాక్రా సంఘం మహిళలు

రుణాలే తీసుకోలేదు.. తిరిగి చెల్లించాలా..?

▸ డ్వాక్రా సంఘాల మహిళలు ఆగ్రహం

▸ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట ఆందోళన

కొత్తూరు, జూలై 3 : రుణాలు తీసుకోకుండానే తిరిగి చెల్లించాలని తమకు ఎలా నోటీసులు ఇస్తారని అనకాపల్లి మండలంలోని కొత్తూరు, ఎన్జీవో కాలనీకి చెందిన డ్వాక్రా సంఘ మహిళలు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దొడ్డి జానకి, కందుల అప్పల కొండ తదితరులు మాట్లాడుతూ తమకు యూనియన్ బ్యాంకులో అకౌంటు ఉందని, అది కూడా డ్వాక్రా పొదుపు సంఘంలో సభ్యులం కనుక అక్కడ అకౌంటు తెరిచామన్నారు. ఇదిలావుండగా, ఈ నెల ఒకటో బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.20 లక్షలు చెల్లించాలని నోటీసు వచ్చిందన్నారు. తమ పేర్లతో ఎవరో రుణం తీసుకొని ఉంటారని సదరు బ్యాంకుకు వెళ్లి అడగ్గా వాస్తవం బయటపడిందన్నారు. తమకు తెలియకుండా వీవోఏగా పనిచేస్తున్న నషీమా తమ సంతకాలు, ఆధార్ కార్డులు పెట్టి 2022లో రూ.20లక్షలు తీసుకున్నట్టు ఆరోపించారు. ఇదే విషయమై అనకాపల్లి పట్టణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని ఆ రుణానికి తమకు ఎటువంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. తమను మోసగించడమే కాకుండా బ్యాంకును తప్పుదోవ పట్టించిన నషీమాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా తమ పేర్లపై రుణం రూపేణా తీసుకున్న నగదును ఆమె వద్ద నుంచే రికవరీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ అంశంపై బ్యాంకు చీఫ్ మేనేజర్ బి.శ్రీనివాసరావును వివరణ కోరగా, 2022 జనవరి నుంచి 2023 మార్చి వరకు 22 గ్రూపులకు అప్పటి బ్యాంకు మేనేజర్ రుణాలు మంజూరు చేశారన్నారు. తాను బాధ్యతలు స్వీకరించిన తరువాత తీసుకున్న రుణాలు ఏ ఒక్కటీ రికవరీ కాకపోవడంతో 30 మంది డ్వాక్రా మహిళలకు నోటీసులు పంపించానని తెలిపారు. దీంతో రుణాలు మంజూరులో అవకతవకలు బయటపడ్డాయన్నారు. ఈ విషయాలన్నింటినీ ఇప్పటికే ఏపీడీ దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. అధికారుల సమక్షంలో దొడ్డి జానకి, కందుల అప్పల కొండల పేరిట రుణం తీసుకోవడం వాస్తవమేనని నషీమా అంగీకరించారన్నారు. ఈ విషయంపై పూర్తి విచారణ చేపట్టాలని పోలీసులకు, డీఆర్‌డీఏ పీడీ దృష్టికి తీసుకువెళ్లామని ఆయన వివరించారు.

పశువుల పాకల్లో దొంగలు పడ్డారు

▸ అపహరణకు గురైన పాడి ఆవులు, గేదెలు

▸ రోడ్లపై తిరిగే ఆవులను కూడా వదలని వైనం

▸ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

చోడవరం, జూలై 3 : మండలంలో పాడి పశువుల దొంగతనాలు ఎక్కువయ్యాయి. పశువుల పాకల వద్ద ఉన్న పాడి గేదెలు, ఆవులను ఎత్తుకుపోవడంతో పాటు రోడ్లపై తిరిగే ఆవులను కూడా వదిలిపెట్టకుండా దొంగలు తరలించుకుపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 18న మండలంలోని గజపతినగరం పెద్దమదుము కళ్లాల వద్ద రైతులు శరడడం రామా



చోడవరంలోని పశువుల పాక (ఫైల్)

రావు, నరసింగరావులకు చెందిన రెండు పాడి జెర్సీ ఆవులను దొంగలు ఎత్తుకుపోయారు. పాకల వద్ద కట్టి ఉంచిన పాడి ఆవులను అర్ధరాత్రి పాకల నుంచి తరలించుకుపోయారు. అదే ప్రాంతంలో మరో రెండు పాడి ఆవులను కూడా దొంగలు తరలించుకుపోవడానికి విఫలయత్నం చేశారు. కాగా పట్టణ శివారు నరసయ్యపేటలోని ముగ్గురు రైతులకు చెందిన గేదెలు రెండురోజుల వ్యవధిలో చోరీకి గురయ్యాయి. పాకల వద్ద కట్టిన పశువులను దొంగలు తరలించుకు పోయారు. కాగా పట్టణంలోని బానయ్యకోనేరు ప్రాంతానికి చెందిన లక్ష్మి అనే మహిళకు చెందిన ఆవు రోడ్డుపై ఉంటే, దానిని కూడా దొంగలు బలవంతంగా తోలుకుపోయారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నరసయ్యపేట ప్రాంతంలో పశువుల అపహరణకు సంబంధించి స్థానికుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. నలుగురైదుగురు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి ఈ పశువుల దొంగతనాలకు పాల్పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు స్పందించి ఈ పశువుల దొంగతనాలకు కళ్లెం వేయడంతో పాటు ఎత్తుకుపోయిన పశువులను తిరిగి ఇప్పించవలసిందిగా పోలీసులను రైతులు కోరుతున్నారు.

అయోధ్యకు సైకిల్‌పై వెళ్లి మొక్కు తీర్చుకున్న పవన్ అభిమాని

బుచ్చెయ్యపేట, జూలై 3 : మండలంలోని పొట్టిదొరపాలేనికి చెందిన కొల్లిమళ్ల పెంటారావు డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్ వీరాభిమాని. పెంటారావు పుట్టుకతోనే మూగ, చెవుడు.అయితే ఎన్నికల్లో పవన్ గెలిస్తే అయోధ్యకు సైకిల్‌పై వచ్చి దర్శించు కుంటానంటూ మొక్కుకున్నాడు. అతడు ఆశించినట్టేపవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి భారీ మెజార్టీతో గెలవడమే కాకుండా డిప్యూటీ సీఎం కూడా కావడంతో పెంటారావు మొక్కు తీర్చేకునేందుకు జూన్ 21న సైకిల్‌పై ఇక్కడ నుంచి బయలుదేరాడు. బుధవారం అయోధ్య చేరుకొని బాల రాముడిని దర్శించుకొని మొక్కు తీర్చుకు న్నాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలకు తమ కుటుంబ సభ్యులు, పొట్టిదొరపాలెం లోని మిత్రులకు పంపి ఆనందం పంచుకున్నాడు.



సైకిల్‌పై అయోధ్య చేరుకున్న పవన్ అభిమాని పెంటారావు

సభాపతిని మర్యాదపూర్వకంగా కలిసిన డీపీవో

నర్సీపట్నం, జూలై 4 : శాసన సభాపతి అయ్యన్నపాత్రుడుని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి బుధవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాలలో పారిశుధ్యం మెరుగు పరచాలని అయ్యన్నపాత్రుడు సూచించారు.



సభాపతిని కలిసి మొక్క అందిస్తున్న డీపీవో శిరీషారాణి

అలాగే జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ సుగుణేశ్వరావు, ఆర్డీవో జయరాం, 108 ఉద్యోగులు, నాలుగు మండలాల టీడీపీ నాయకులు స్పీకర్‌ను కలిశారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

▸ టీచ్ టూల్ శిక్షణ శిబిరంలో రాష్ట్ర పరిశీలకురాలు భాగ్యశ్రీ, డీఈవో వెంకటలక్ష్మమ్మ

కశింకోట, జూలై 3 : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారిని కూడా ఉత్తములుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్‌సీఆర్‌టీ రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ జి.ఆర్.భాగ్యశ్రీ, డీఈవో వెంకటలక్ష్మమ్మ సూచించారు. ఇక్కడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులంతా విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందేలా తమవంతు కృషి చేయాలన్నారు. శతశాతం సర్టిఫైడ్ అబ్జర్వర్‌గా ఉత్తీర్ణత సాధించాని కోరారు. బోధనాభ్యాసన సామగ్రిని విరివిగా వినియోగించాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు అనకాపల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక, ఎస్.రాయవరం, కశింకోట, యలమంచిలి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులు 120 మంది హాజరయ్యారు. ఏఎంవో ఎం.ఎం.పట్నాయక్, కోర్సు డైరెక్టర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

ఎం.ఆర్.వి అప్పారావు, మాస్టర్ ట్రైనీలు నారాయణరావు, అచ్యుతకృష్ణ, నూకేష్, ఫణీంద్రకుమార్, వేణుగోపాల్, శ్రీరామమూర్తి, కశింకోట ఎంఈవో-2 మూర్తి, ఏపీవో వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

▸ పలు ఇళ్లలో ఏసీలు, ఫ్రిజ్‌లు తదితర గృహోపకరణాలు దగ్ధం

▸ సుమారు రూ.10 లక్షల వరకు నష్టం జరిగినట్టు అంచనా



జానకి హరి ఇంట్లో కాలి బూడిదైన గృహోపకరణాలు

కోటవురట్ల, జూలై 3 : ఇక్కడి సినిమాహాల్ రోడ్డులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పలు ఇళ్లలో గృహోపకరాలు కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.పది లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని అంచనా. ఇందుకు సంబంధించిన వివరాలివి. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా బుధవారం సాయంత్రం నాలు గు గంటల ప్రాంతంలో టీడీపీ నాయకుడు జానకి హరి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. దీంతో అతని ఇంట్లోని ఏసీ నుంచి మంటలు చెలరేగాయి. మంటలు క్షణాల్లో వ్యాపించి ఏసీతో పాటు ఫ్యాన్లు, పరుపులు, సోఫాసెట్లు, మంచాలు, బట్టలు తదితరాలు కాలి బూడిదయ్యాయి. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లో నుంచి మంటలు రావడాన్ని గుర్తించి యువకులు మంటలు ఆర్పే ప్రయత్నం చేయడంతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పక్క ఇళ్లకు మంటలు వ్యాపించలేదు. సమాచారం తెలుకున్న తహసీల్దార్ వెంకరమణ, వీఆర్వో అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే ఇదే గ్రామానికి శెట్టి రమణ ఇంట్లో ఏసీ, సోఫా, నిమ్మల కృష్ణారావు ఇంట్లో ఫ్రిజ్, జానకి రమణ ఇంట్లో టీవీ, ఫ్రీజ్ కాలిపోయాయి. ఈ ప్రమానికి హై ఓల్టేజీయే ప్రధాన కారణమని బాధితులు ఆరోపించారు.

'వెలుగు' తీరుపై డ్వాక్రా మహిళలు ఆగ్రహం

రుణాల మంజూరుకు మహిళా మార్టులో కొనుగోలు నిబంధనపై నిలదీత



సభ్యులకు సమాధానం చెబుతున్న ఏపీఎం రాజబాబు

పాయకరావుపేట, జూలై 3 : మహిళా మార్టులో సరకులు తప్పనిసరిగా కొనాలని, లేకుంటే రుణాలు మంజూరు చేయబోమని వెలుగు సిబ్బంది డ్వాక్రా మహిళలను బెదిరించడం పట్ల ఎంపీటీసీ సభ్యురాలు ఎం.రమాకుమారితో పాటు పలు డ్వాక్రా సంఘాల సభ్యులు స్థానిక వెలుగు కార్యాలయానికి చేరుకుని ఏపీఎం రాజబాబుతో పాటు సిబ్బందిని నిలదీశారు. వీరికి కూటమి నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో ఉన్న మహిళా మార్టులో ఒక్కో డ్వాక్రా సభ్యురాలు వెయ్యి రూపాయలు చొప్పున ఒక సంఘం నుంచి 10వేల రూపాయల విలువైన సరకులు కొంటేనే డ్వాక్రా లోన్లు, సభ్యులకు శ్రీనిధి రుణాలు మంజూరుకు సీఏలు తీర్మానాలు రాస్తామనడం ఏమిటని ప్రశ్నించారు. మహిళా మార్టు ప్రచారంలో భాగంగా సరకులు కొనాలని సభ్యులను రిక్వెస్టు చేయవచ్చుగాని, సరకులు కొంటేనే రుణాలు మంజూరు చేస్తామనడం ఎంతవరకు సబబు అని ప్రశించారు. డ్వాక్రా మహిళలకు మద్దతు పలికిన కూటమి నాయకులు, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ రుణాల మంజూరు కోసం సరకులు కొనుగోలు చేయాలని వెలుగు సిబ్బంది బెదిరుస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై డ్వాక్రా సంఘాల సభ్యులు హోం మంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పటికైనా వెలుగు సిబ్బంది పనితీరు మార్చుకోవాలని హితవు పలికారు. దీనిపై ఏపీఎం రాజబాబు సమాధానమిస్తూ మహిళా మార్టులో సరుకులు తప్పనిసరిగా కొనుగోలు చేయమని తాము సభ్యులను డిమాండ్ చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు దేవాది మంగాదేవి, పలువురు డ్వాక్రా మహిళలతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, పల్లా విలియంకేరి, చింతకాయల రాంబాబు, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లను తట్టుకొనే చెరకు రకాలే మేలు

... 3వ పేజీ తరువాయి

ఎరువులను వినియోగించాలని రైతులను కోరారు. నత్రజని స్థిరీకరించే జీవన ఎరువులు, అలాగే భాస్వరం, పోటాస్‌లను పెంపొందించే జీవన ఎరువులు అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో లభ్యమవుతున్నాయన్నారు. ఈ ఏడాది ఇంతవరకు 3,900 లీటర్లు ద్రవ రూప జీవన ఎరువులను, 300 కిలోల ఘనరూప ఎరువులను రైతులకు విక్రయించామని తెలిపారు. ఈ ఎరువులు ఆర్‌ఏఆర్‌ఎస్‌లోనే తయారవుతున్నాయని ఆయన తెలిపారు.

ఆస్తి కోసం ఘాతుకం

... 3వ పేజీ తరువాయి

బుధవారం సతీశ్‌కుమార్ ఇంటిని పరిశీలించారు. క్లూస్ బృందం ఆధారాలు సేకరించి అనుమానం వ్యక్తం చేసింది. దీంతో అనుమానితులను పోలీసులు విచారించారు. ఈ క్రమంలో వరుసకు తమ్ముళ్లే అతనిని హత్య చేశారన్న విషయం వెలుగులోకి వచ్చింది. గత నెల 27వ తేదీన సతీశ్‌కుమార్‌కు వరుసకు తమ్ముళ్లు అయిన సాయి మనోజ్‌కుమార్, డి.రాజేశ్‌లు అతని ఇంటికి వెళ్లారు. సతీశ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగి ఛాతీ, ముఖంపై పిడి గుద్దులు గుద్ది హత్య చేశారు. అదే రోజు రాత్రి అతని మృతదేహాన్ని కారులో ఎక్కించి ఎస్.రాయవరం మండలం దార్లపూడి సమీపంలోని పోలవరం కాలువ వద్ద నిర్మిస్తున్న ఆక్విడెక్టు కింద నిర్జీవ ప్రదేశంలో గోతిలో పూడ్చి పెట్టారు. సాయి మనోజ్‌కుమార్, డి.రాజేశ్‌లు పోలీసు విచారణలో నేరాన్ని అంగీకరించడంతో వారిద్దర్నీ తీసుకుని మృతదేహాన్ని పూడ్చిన ప్రదేశానికి అధికారులు చేరుకున్నారు. ఎస్.రాయవరం తహసీల్దారు విజయలక్ష్మి, వీఆర్వో, మృతుని కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించడంతో శవ పంచనామా పూర్తి చేసి మృతదేహాన్ని వారికి అప్పగించారు. నిందితులను అరెస్టు చేశారు. ఆస్తి తగాదాలే ఈ హత్యకు కారణమై ఉండవచ్చని సీఐ గఫూర్ తెలిపారు.

'ఉపాధి హామీ'లో భారీగా అక్రమాలు

▸ వలసలు వెళ్లినవారి పేరిట సైతం తప్పుడు మస్తర్లు ▸ గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువు

▸ కోటవురట్ల మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ఆగ్రహం ▸ గ్రామాల్లో సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు



సమావేశంలో ఏపీవో గంగునాయుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు

కోటవురట్ల, జూలై 3 : ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, వలసలు వెళ్లినవారి పేరిట సైతం తప్పుడు మస్తర్లు వేసి వీఆర్‌పీలు అవినీతి పాల్పడుతున్నారని కొడవటిపూడి ఎంపీటీసీ యలమంచలి ప్రకాష్ ఆరోపించారు. బుధవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. తొలుత సమావేశం ప్రారంభంలో అజెండాపై కోటవురట్ల ఎంపీటీసీ సూర్యారావు ఎంపీడీవో కాశీవిశ్వనాథంను నిలదీశారు. అనంతరం ఉపాధి పనులపై ఎంపీడీవోను జడ్పీటీసీ ఉమాదేవి, ఎంపీటీసీ సూర్యారావు ప్రశ్నించారు. ఏపీవో మాట్లాడుతూ ప్రస్తుతం కాలువ పూడికతీత పనులు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో కాలువ పనులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇంతలో కొడవటిపూడి ఎంపీటీసీ యలమంచలి ప్రకాష్ కలుగజేసుకుని తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి గూడెంకు 150మంది కూలిపనులకు వెళ్లగా, వారికి మస్తర్లు వేసి వీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు సుమారు రూ.20లక్షల వరకు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇంత జరుగుతున్న ఏపీవోగాని మిగిలిన అధికారులుగానీ పట్టించుకోకపోవడం ఏమిని ప్రశ్నించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ప్రోటోకాల్ పాటించడం లేదంటూ పాములవాక సర్పంచ్ సత్యవతి, నీలిగుంట సర్పంచ్ వరహాలు వాపోయారు. బీకేపల్లి సర్పంచ్ లింగంనాయుడు మాట్లాడుతూ జల్‌జీవన్‌మిషన్ పథకం ద్వారా చేస్తున్న పనుల వల్ల గ్రామాల్లో రోడ్లుపూర్తిగా దెబ్బతిన్నాయని ఆరోపించారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గీతాంజలి బదులిస్తూ కాంట్రాక్టర్ గోతులను పూడ్చుతారని తెలిపారు. జడ్పీటీసీ ఉమాదేవి మాట్లాడుతూ వరహా, సర్పా నదుల్లో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ మాట్లాడుతూ పాలసీ ప్రకారం త్వరలోనే గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో కమిటీలు వేసి, ఇసుక అక్రమ తవ్వకాల నివారణకు చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. అనంతరం మరికొంత మంది సభ్యులు ఆయా గ్రామాల్లో సమస్యలను సభలో ప్రస్తావించారు. వైస్ ఎంపీపీ సాగి సీతాబాబు, మండల ఇంజనీర్ వర్మతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే కొణతాలకు వినతులు



ఎమ్మెల్యే కొణతాలకు సమస్యలు వివరిస్తున్న దివ్యాంగులు

అనకాపల్లి టౌన్, జూలై 3 : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు పలువురు దివ్యాంగులు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన పింఛన్‌లను మంజూరు చేయాలని కోరారు. 2016 దివ్యాంగుల చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలన్నారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో నాలుగు శాతం దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని, ఉపాధి హామీ పథకంలో తమకు ప్రత్యేక ఉపాధి కల్పించాలని, అంత్యోదయ రేషన్‌కార్డు ప్రతి దివ్యాంగుడికి మంజూరు చేయాలని, సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే, దివ్యాంగుల ఏడీ ఆఫీస్ అనకాపల్లిలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలగా బుజ్జి, రాపేటి భాస్కరరావు, బుద్ద ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఎమ్మెల్యే కొణతాలను అనకాపల్లి మోటార్ మెకానిక్‌ల సంఘం ప్రతినిధులు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఇదిలావుంటే, సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో ఏపీ పీటీడీపీ మంజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి అనకాపల్లిలో ఆర్టీసీ డిపోలో ప్రయాణికులు, ఉద్యోగుల సమస్యలు వివరించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావాలి

▸ ఏపీఐఐసీ అధికారులకు ఎమ్మెల్యే సుందరపు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, జూలై 3 : సెజ్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఏపీఐఐసీ అధికారులు కృషిచేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం అచ్యుతాపురంలో గల ఆయన నివాసంలో ఏపీఐఐసీ అధికారులు, సెజ్ నిర్వాసిత నాయకులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నష్టపరిహారం, మేజర్ లబ్ధిదారులకు పరిహారం వంటి సమస్యలను నిర్వాసిత నాయకులు సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. వీరి సమస్యలపై పూర్తి నివేదికను అందజేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు. సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యవేణి, ఏపీఐఐసీ అధికారులతో పాటుగా నిర్వాసిత నాయకులు బైలపూడి రామదాసు, రాజాన విజయ్, అడిగర్ల దేముడు, జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సుందరపు సతీష్‌కుమార్ జన్మదిన వేడుకలు



ఎలమంచిలి పార్టీ కార్యాలయంలో సతీష్‌కుమార్ జన్మదిన వేడుకలు

ఎలమంచిలి/రాంబిల్లి/అచ్యుతాపురం : జూలై 3 : ఇక్కడి జనసేన కార్యాలయం ఆవరణలో బుధవారం ఆ పార్టీ ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు బొద్దపు శ్రీను, కొఠారు శ్రీను, పిట్టా శ్రీనుల సమక్షంలో కేక్‌కట్‌చేశారు. సీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గొర్లె నానాజీ, పల్లా సత్యనారాయణ, సుంకర కొండబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాంబిల్లి మండలంలో జరిగిన వేడుకల్లో పప్పల నూకన్నదొర, కె.లక్ష్మి, వడ్డికాసులు, అల్లవరపు బాబ్జీ, శానాపతి రత్నం, సన్యాసిరావు, ఎం.శంకరరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అచ్యుతాపురం మండలం కొండకర్లలో గల ఇచ్ఛా ఫౌండేషన్‌లో సుందరపు వెంకట సతీష్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు కేక్ కట్‌చేసిన అనంతరం మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి, నిత్యావసర సరకులు అందజేశారు. నాయకులు మోటూరు శ్రీవేణి, కరెడ్ల సూర్య ప్రకాష్, కోరుకొండ ప్రసాద్, పప్పల రమణ, శరగడం నాగార్జున, వడిశల సన్యాసినాయడు, పప్పల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలపాలెం గ్రామ సభలో వాగ్వాదం

▸ మధ్యలోనే వెళ్లిపోయిన సర్పంచ్ వెన్నెల అప్పారావు

▸ కూటమి, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం

▸ ఇరువర్గాల మధ్య తోపులాటతో పోలీసులు రంగప్రవేశం



గ్రామసభలో వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

పరవాడ, జూలై 3 : మండలంలోని వెన్నెలపాలెంలో బుధవారం నిర్వహించిన పంచాయతీ గ్రామసభలో సర్పంచ్, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామస్థులు అడిగిన ప్రశ్నలకు సర్పంచ్ సమాధానం చెప్పలేకమధ్యలోనే వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే.... ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి పంచాయతీల్లో సాధారణ గ్రామసభ నిర్వహిస్తారు. పంచాయతీలో జరిగిన అభివృద్ధి గురించి చర్చ జరుపుతారు. ఇదే మాదిరిగా వెన్నెలపాలెం పంచాయతీ గ్రామసభను సర్పంచ్ వెన్నెల అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. పంచాయతీకి చెందిన ఏసీ కల్యాణ మండపానికి అద్దె రూపంలో వచ్చిన నిధులు లెక్కలు చెప్పాలని గ్రామస్థులు ఆయనను నిలదీశారు. అలాగే స్థానిక ఎన్టీఆర్ కాలనీలో వీధి కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై సర్పంచ్ సరైన సమాధానం చెప్పకుండా వెళ్లి పోయారు. ఈ క్రమంలో గ్రామంలో నెలకొన్న సమస్యలపై కూటమి, వైసీపీ శ్రేణుల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది.ఇరువురు మధ్య తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీస్ కానిస్టేబుల్ పరవాడ సీఐకు సమాచారమిచ్చారు. సీఐ బాలసూర్యారావు సిబ్బందితో గ్రామసభ వద్దకు చేరుకుని సర్దిచెప్పారు. అనంతరం ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు గ్రామసభను కొనసాగించారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్.వరలక్ష్మి, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గణిత ఫోరంలో ప్రతిభ



ఉపాధ్యాయులు షేక్ నాగూర్, స్వర్ణగౌరీలను అభినందిస్తున్న డీఈవో

పాయకరావుపేట/ఎస్.రాయవరం, జూలై 3 : ఇటీవల రాష్ట్రస్థాయి గణిత ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనల్లో పాయకరావుపేట మండలం గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించి తమ ప్రతిభను చాటారు. పాఠశాల గణిత ఉపాధ్యాయుడు షేక్ నాగూర్ పర్యవేక్షణలో విద్యార్థులు పలు గణిత ప్రదర్శనలు చేయడం పట్ల అభినందనలు వ్యక్తం చేసిన డీఈవో ఎం.వెంకటలక్ష్మి బుధవారం షేక్ నాగూర్‌తో పాటు పాఠశాల హెచ్ఎం జి.రామారావు తదితరులను అభినందించి జ్ఞాపికను అందజేశారు. అలాగే, ఎస్.రాయవరం మండలంలోని రేవుపోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయిని కె.స్వర్ణగౌరీ ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఆమెను డీఈవో వెంకటలక్ష్మమ్మ అభినందించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వీరభద్ర, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ,, హెచ్ఎం పిళ్లా శ్రీనివాస్‌తో ఉపాధ్యాయులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

బాలికల పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు

పాయకరావుపేట, జూలై 3 : ఇక్కడి జడ్పీ బాలికోన్నత పాఠశాల పరిసరాల్లో బుధవారం మూడు సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ పి.అప్పలరాజు మాట్లాడుతూ ఈ పాఠశాలలోనే మహిళా జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నందున ఈవ్ టీజింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు పట్టణానికి చెందిన కంభంపాటి వెంకటరమణ ఆర్థిక సహాయం అందించారని పేర్కొంటూ అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అనకాపల్లి టౌన్, జూలై 3 : సీజనల్ వ్యాధుల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి సూచించారు. కోట్నివీధి, సిరసపల్లి పీహెచ్‌సీల్లో బుధవారం ఆమె ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టానిక్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. డాక్టర్ జి.నాగేంద్ర, వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, కూటమి నాయకులు కోట్ని రాంబాబు, దుడ్డు నాగేశ్వరరావు, షేక్ రియాజ్, సిరసపల్లి సన్యాసిరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో గల పలు గ్రామాల్లో డెంగ్యూపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ, డాక్టర్ వాసంతి మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య సిబ్బంది పీఎస్‌వీఎస్ ప్రసాద్, టి.నాగేశ్వరరావు, ఎస్ఎస్‌వీవీ ప్రకాష్, వై.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆఫీసర్ మూర్తికి కెప్టెన్‌గా పదోన్నతి

కొత్తూరు, జూలై 3 : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఎన్‌సీసీ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏఎస్ఎన్ మూర్తికి కెప్టెన్‌గా పదోన్నతి లభించిందని కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనను అధ్యాపక సిబ్బంది అభినందించారు.

గ్రామీణ తపాలా ఉద్యోగులు ఆందోళన



సమస్యలపై నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జూలై 3 : గ్రామీణ తపాలా ఉద్యోగులపై పోస్టల్ శాఖ విధిస్తున్న టార్గెట్‌లను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇక్కడి పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆలిండియా డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో సంస్థకు అత్యధిక సంపద సృష్టించే జీడీఎస్‌లపై ప్రతిరోజూ టార్గెట్ విధిస్తూ వేధిస్తున్న తపాలా శాఖ అధికారుల వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. జీడీఎస్‌లతో వెట్టిచాకిరీ చేయించుకునే విధానం విడనాడాలన్నారు. టార్గెట్ విధింపు మానుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం, డాక్ సేవక్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.సతీష్‌కుమార్, కోశాధికారి పి.నూకరాజుదొర, ఎం.నాగేశ్వరి, కె.మధు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంజయ్‌పాండాకు అందజేశారు.

గెడ్డవాగుల్లో ఆక్రమణలు తొలగింపు



ఆక్రమణను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం, జూలై 3 : మండలంలోని ఇరువాడ లో ఆక్రమణలను అధికారులు తొలగిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. ఇరువాడ గ్రామ సర్వే నెంబర్లు 106, 103లలో సుమారు మూడు ఎకరాల గెడ్డ వాగు/పోరంబోకు స్థలాన్ని ఓ రియల్టర్ ఆక్రమించి లే-అవుట్ వేసి విక్రయించినట్టు అదే గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు గత నెల 24న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఆందోళన చేపట్టాడు. అనంతరం కలెక్టర్‌కు ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఆర్ఐ వీరయ్య, సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు బుధవారం ఆక్రమిత ఆ ప్రాంతాలుగా పేర్కొంటున్న చోట సర్వే నిర్వహించారు. అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారి నుంచి ప్రైవేటు లే-అవుట్‌కు వెళ్లే మార్గం 23 సెంట్లు సర్వే నెంబరు 106లో ఉందని గుర్తించినట్టు సర్వేయర్ శ్రీనివాసరావు తెలిపారు. అయితే పూర్తి స్థాయిలో ఎంతవరకూ ఆక్రమణకు గురైందన్నది సర్వే పూర్తి చేసి గురువారం వెల్లడిస్తామన్నారు. గతంలో ప్రస్తుత మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి టీడీపీ నేతలతో కలిసి ఆక్రమిత ప్రాంతాలను సందర్శించి పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అయినప్పటికీ అప్పుడు అధికారులు పట్టించుకోలేదు.

బయ్యవరంలో...

కశింకోట: బయ్యవరంలో చెరువును ఆను కొని అక్రమంగా ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలను తొలగించాలని కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ మధుసూదన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 299లో ఉన్న ఆక్రమణలను తొలగించి గ్రామానికి న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు సి.హెచ్.అప్పలనాయుడు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాబర్, చామంతుల రమణారావు, టీడీపీ నాయకులు సిదిరెడ్డి ప్రసాద్, శీరం వెంకటలక్ష్మి, గొల్లవిల్లి ప్రవీణ్, మేడిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి అల్లూరి

... 3వ పేజీ తరువాయి

వివిధ ప్రదేశాలకు వెళ్లి నివసించాల్సి వచ్చింది. దీంతో తండ్రి మరణం సీతారామరాజు విద్యపై తీవ్ర ప్రభావం చూపింది.

తొలి స్థావరం కృష్ణాదేవిపేట..

సీతారామరాజు తొలి స్థావరం కృష్ణాదేవిపేటగా ఏర్పర్చుకున్నాడు. కృష్ణాదేవిపేటలో చిటికెల భాస్కరనాయుడు ఆశ్రయం కల్పించాడు. 1917లో స్నేహితుడు పేరిచర్ల సూర్యనారాయణతో కలిసి కాషాయ వస్త్రాలు ధరించి కృష్ణాదేవిపేటలో నీలకంఠేశ్వరుని ఆలయంలో మకాం పెట్టాడు. అక్కడ ఉంటూనే ఆదివాసీలపై బ్రిటీష్ పాలకుల దురాగతాలు, అకృత్యాలను తెలుసుకుని రగిలిపోయాడు. అదే సమయంలో బ్రిటీష్ పాలకులపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఆదివాసీలకు కూలి చెల్లింపులో అన్యాయంపై లేఖ

లంబసింగి ఘాట్ రోడ్డు నిర్మాణంలో పనిచేస్తున్న గిరిజనులకు చెల్లించే కూలీలో చింతపల్లి తహసీల్దార్ బాస్టియన్ అన్యాయం చేయడంపై బ్రిటీష్ పాలకులకు సీతారామరాజు లేఖ రాశాడు. తనపై ఫిర్యాదు చేశాడనే కోపంతో బాస్టియన్.. సీతారామరాజు గిరిజనులను కూడగట్టి విప్లవం తీసుకు వచ్చేందుకు సన్నాహాల్లో ఉన్నాడని బ్రిటీష్ ప్రభుత్వానికి లేఖ రాశాడు. దీంతో సీతారామరాజును కొన్నాళ్లు అడ్డతీగల సమీపం పైడిపుట్టిలో, నర్సీపట్నంలో అధికారుల కనుసన్నల్లో బ్రిటీష్ ప్రభుత్వం ఉంచింది. బ్రిటీష్ ప్రభుత్వ ఉద్యోగి ఫజులుల్లాఖాన్ సీతారామరాజును చాలా అభిమానించి సహాయం చేసేవాడు. దీంతో ఫజులుల్లాఖాన్‌కి తిరుగుబాటు చేయనని సీతారామరాజు మాట ఇచ్చాడు. ఈ మాటకు ఆయన కట్టుబడి ఉన్నాడు. 1922 జూలై 27న ఫజులుల్లాఖాన్ ఆకస్మికంగా మరణించాడు. దీంతో సీతారామరాజు ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. గిరిజన ప్రాంతంలో అడుగుపెట్టి గంటందొర, మల్లుదొర, మొట్టడం వీరయ్యదొర, కంకిపాటి ఎం డుపడాల్, సత్యనారాయణరాజు, అగ్గిరాజు, గోకిరి ఎర్రేసుతో సహా 150 మంది గిరిజనులను బ్రిటీష్ పాలకులపై పోరాటానికి సిద్ధం చేశాడు. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి సాయుధ పోరాటానికి సిద్ధపడి చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడికి నిర్ణయం తీసుకున్నారు.

చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడితో సాయుధ పోరాటం

అల్లూరి సీతారామరాజు తన అనుచరులతో తొలిసారిగా 1922 ఆగస్టు 22న చింతపల్లిపై దాడి చేసి సాయుధ పోరాటానికి నాంది పలికాడు. స్టేషన్‌లో 11 తుపాకులు, 5 కత్తులు, 1,390 తుపాకీ గుళ్లు, 11 బాయొనెట్లు స్వాధీనం చేసుకున్నారు. తాను స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను రికార్డులో నమోదు చేశాడు. అదే క్రమంలో 23వ తేదీన కృష్ణాదేవిపేట, 24న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌లపై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాడు. సీతారామరాజు పోరాటంలో అత్యంత సాహసోపేతంగా అక్టోబర్ 15న అడ్డతీగల పోలీస్ స్టేషన్‌కు ముందుగా సమాచారం ఇచ్చి మరీ దాడి చేశారు. అదే నెల 19న రంపచోడవరం పోలీస్ స్టేషన్‌ను పట్టపగలే ముట్టడించి మొదటి దశ విప్లవానికి శ్రీకారం చుట్టారు. అదే ఏడాది డిసెంబర్ 6 నుంచి రెండోవ దశ ఉద్యమాన్ని ప్రారంభించిన సీతారామరాజు బ్రిటీష్ పాలకులను ముప్పతిప్పలు పెట్టాడు.

ఉద్యమం అణచివేతకు రూథర్‌ఫర్డ్ నియామకం

సీతారామరాజు ఉద్యమాన్ని అణచివేసేందుకు 1924 ఏప్రిల్ 17 మన్యానికి కలెక్టర్‌గా రూథర్‌ఫర్డ్‌ను నియమించారు. అతనికి విప్లవాలను అణచివేయడంతో నిపుణుడిగా పేరుంది. ఆయన కృష్ణాదేవిపేటలో సభను ఏర్పాటుచేసి వారం రోజుల్లో విప్లవకారుల ఆచూకీ తెలియకపోతే ప్రజలను కాల్చివేస్తామని హెచ్చరించాడు. ఈ విషయం తెలుసుకున్న సీతారామరాజు అదే ఏడాది మే 7న తాను ఉన్న ప్రాంతాన్ని పశువుల కాపరి ద్వారా పోలీసులకు చేరవేసి మంప చెరువులో స్నానంచేస్తూ పట్టుబడ్డాడు. ఎటువంటి విచారణ లేకుండా అల్లూరి సీతారామరాజును కొయ్యూరులోని చింతచెట్టుకు కట్టి గుడాల్ కాల్చిచంపాడు. 8వ తేదీన సీతారామరాజు దేహాన్ని ఫొటో తీయించి కృష్ణాదేవిపేటలో దహనం చేశారు.

అల్లూరి నడయాడిన చోట పార్కు ఏర్పాటు

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో మన్యం విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నడయాడిన చోట స్మారక మందిరం(పార్కు)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అల్లూరితో పాటు గంటందొర సమాధులను నిర్మించి, గ్రానైట్ రాళ్లతో తాపడం చేశారు. పార్కు చుట్టూ ప్రహరీ గోడ, సమాధులున్న ప్రదేశంలో నీడ కోసం భవనం నిర్మించారు. ఆ స్మారక మందిరాన్ని నిత్యం ఎంతో మంది సందర్శిస్తుంటారు.

తునివలస పాల కేంద్రం అధ్యక్షుడిగా కొండబాబు

» కలిసి వచ్చిన వైసీపీ వర్గపోరు



కొండబాబును అభినందిస్తున్న వైసీపీ, టీడీపీ నేతలు

చీడికాడ, జూలై 3 : మండలంలోని తునివలస పాలకేంద్రంలో జరిగిన విశాఖ డెయిరీ కమిటీ అధ్యక్ష ఎన్నికల్లో వైసీపీలో వర్గపోరు పుణ్యమా అని టీడీపీకి చెందిన ఒకే ఒక్క డైరెక్టర్ పేరపు కొండబాబు (తేజ) అధ్యక్షుడయ్యాడు.

తునివలసలో ఉన్న విశాఖ డెయిరీ కమిటీ అధ్యక్షుడితో కలిపి మొత్తం పదిమంది డైరెక్టర్లు ఉండేవారు. ఇందులో ఒక డైరెక్టర్ మృతి చెందగా, మరో డైరెక్టర్ ఉపాధి నిమిత్తం బెంగళూరు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిది మంది డైరెక్టర్లలో అధ్యక్షుడిగా ఉన్న వింటి పాల్గుణ, మరొక డైరెక్టర్ ధర్మిశెట్టి తాతారావుల పదవీకాలం పూర్తయింది. రెండు రోజుల క్రితం పాలకేంద్రంలో జరిగిన ఎన్నికల్లో ధర్మిశెట్టి నాగేష్ (వైసీపీ), కొండబాబు (టీడీపీ)ని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. దీంతో వైసీపీ నుంచి ఏడుగురు డైరెక్టర్లు ఉండగా, టీడీపీకి చెందినవారు ఒకరు ఉన్నారు. కాగా, గ్రామంలో ఉన్న సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు వర్గపోరులో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో టీడీపీకి చెందిన సీనియర్ నాయకుడు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పేరపు కొండబాబు గ్రామంలో ఉన్న సహచర టీడీపీ నాయకులతో మాట్లాడి అనంతరం వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ పడాల అప్పల నాయుడుతో మంతనాలు జరిపారు. మాజీ పాల సంఘం అధ్యక్షుడికి మరలా డైరెక్టర్‌గా ఎన్నుకోవడానికి టీడీపీకి చెందిన పాల సంఘం డైరెక్టర్ పేరపు కొండబాబుని అధ్యక్షునిగా ఎన్నుకునేందుకు ఒప్పందం కుదిరింది. ఈ ప్రకారం మంగళవారం అధ్యక్షునిగా టీడీపీకి చెందిన కొండబాబుని ఆరుగురు డైరెక్టర్లు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొండబాబును వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ పడాల అప్పలనాయుడుతో పాటు మాజీ సంఘం అధ్యక్షుడు వింటి పాల్గుణ తదితరులు కొండబాబును అభినందించారు.

బోధన మెరుగుకు కృషి చేయాలి

» ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకురాలు భాగ్యశ్రీ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న భాగ్యశ్రీ

నర్సీపట్నం, జూలై 3 : శిక్షణా కాలంలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు పరిచి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర పరిశీకులు జీఆర్ భాగ్యశ్రీ అన్నారు. బుధవారం ఐదు రోడ్లు కూడలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్ టూల్ అబ్జర్వేషన్ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. బోధన సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రవర్తన వివరించారు. తొమ్మిది రోజుల పాటు జరుగుతున్న శిక్షణ సమయంలో నేర్చుకున్న ప్రతీ అంశాన్ని బోధన సమయంలో అమలు పరిచి విద్యార్థుల మెరుగైన బోధన కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ కో-ఆర్డినేట్ బి.శకుంతల, జిల్లా సైన్స్ అధికారి డి.కాళిదాస్, ఎంఈవో నాగేంద్ర పాల్గొన్నారు.

సంపూర్ణంగా పింఛన్ల పంపిణీ



ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న సిబ్బంది

కె.కోటపాడు, జూలై 3 : సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ సంపూర్ణంగా జరిగిందని ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. మండలంలో 99.34 శాతం మందికి ఆయా ఇళ్ల వద్ద నగదు అందించగా, మిగిలిన వారికి అనారోగ్య కారణాలతో ఆసుపత్రికి సిబ్బంది వెళ్లి అందించినట్టు చెప్పారు. మండలంలో 11002 పెన్షన్లు ఉండగా, ఇళ్ల వద్ద 10929 పెన్షన్లు ఒకే రోజున అందించారని అన్నారు. పింఛన్లను విజయవంతంగా అందించిన సిబ్బందిని ఎంపీడీవో అభినందించారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

» తురకలపూడి పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి



పెదపూడి ర్యాలీలో నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

బుచ్చెయ్యపేట, జూలై 3 : పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంధ్యారాణి అన్నారు. ఆమె బుధవారం పెదపూడి సచివాలయం పరిధిలోని గల గ్రామాల్లో రోగులు,అంగన్వాడీ కేంద్రం, స్థానిక యూపీ స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే అతిసార వ్యాధి నివారణపై విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెరుగైన పరిశుభ్రత అంటువ్యాధుల వ్యాప్తి నివారణతో పాటు సంపూర్ణమైన ఆరోగ్యాన్ని కలిగిస్తుందని సంధ్యారాణి అన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

చీడికాడ, జూలై 3 : పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులు సోకవని చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఖండివరం హెల్త్ సబ్‌సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా గ్రామస్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. అలాగే ఎవరూ బహిరంగ మలవిసర్జన చేయకుండా తప్పకుండా మరుగుదొడ్లు వాడాలన్నారు. వైద్య శిబిరంలో 35 మంది రోగులను తనిఖీ చేసి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, ఆశవర్కర్లు సేవలు అందించారు.

తెగుళ్లను తట్టుకొనే చెరకు రకాలే మేలు

... 3వ పేజీ తరువాయి

ఎరువులను వినియోగించాలని రైతులను కోరారు. నత్రజని స్థిరీకరించే జీవన ఎరువులు, అలాగే భాస్వరం, పోటాస్‌లను పెంపొందించే జీవన ఎరువులు అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో లభ్యమవుతున్నాయన్నారు. ఈ ఏడాది ఇంతవరకు 3,900 లీటర్లు ద్రవ రూప జీవన ఎరువులను, 300 కిలోల ఘనరూప ఎరువులను రైతులకు విక్రయించామని తెలిపారు. ఈ ఎరువులు ఆర్ఏఆర్ఎస్‌లోనే తయారవుతున్నాయని ఆయన తెలిపారు.

ప్రజలపై దోమల దండయాత్ర

» నివారణ చర్యలు అంతంతమాత్రమే..
» అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
» జ్వరాల బారిన జనం
» డెంగ్యూ, మలేరియా కేసులు పెరిగే పరిస్థితి
» నీటి నిల్వలు, కాలువల శుభ్రతపై నిర్లక్ష్యం
» అధికారుల తీరుపై పట్టణవాసుల అసంతృప్తి



శివపురం ఎస్టీ హాస్టల్ దగ్గర రోడ్డు పక్కనే నిలిచి పోయిన నీరు, పేరుకు పోయిన చెత్త



వెంకునాయుడుపేటలో కాలువల్లో చెత్తాచెదారం, పందులు

నర్సీపట్నం, జూలై 3 : మునిసిపాలిటీలో రోజురోజులూ దోమల బెడద అధికమవుతోంది. దీంతో ప్రజల రోగాల బారిన పడుతున్నారు. దోమలు రాత్రీ పగలు తేడా లేకుండా ప్రజల మీద దాడి చేస్తున్నాయి. క్షీణించిన పారిశుధ్యం, ఖాళీ స్థలాలలో నీటి నిల్వలు కారణంగా దోమల బెడద విపరీతంగా పెరిగిపోతోంది. నర్సీపట్నంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వార్డుల్లో కాలువలు శుభ్రం చేయడం లేదు. ఇటీవల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మెయిన్ రోడ్డు కాలువ నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కోర్టు కేసులు కారణంగా విస్తరణ పనులకు ఆటంకం ఉన్న చోట డ్రైనేజీ పనులు మధ్యలో నిలిపేశారు. దీంతో కాలువలో మురుగు నీరు నిల్వ ఉండటం వలన దోమల పెరిగిపోయాయి. కాలువలలో పూడిక పేరుకుపోయి నీరు పారడం లేదు.

అప్రమత్తం కావాలి

గత నెలలో వైరల్ జ్వరాలతో పాటు సీజనల్ వ్యాధులుగా పేర్కొనే మలేరియా, డెంగ్యూ జ్వరాలు నమోదు అయ్యాయి. మలేరియా జ్వరాలు ఎక్కువగానే ఉన్నప్పటికీ రోగులు ప్రైవేటు ఆస్పత్రిలలో వైద్యం చేయించు కోవడం వలన ప్రభుత్వ లెక్కల్లోకి రావడం లేదు. జూలై నెలలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మునిసిపల్ అధికారులు ముందుగా తేరుకొని దోమల నివారణ, పారిశుధ్యంపై దృష్టి సారించకుంటే ప్రజలు మరింతగా రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు.

ఇటీవల కురుస్తున్న వర్షాలకు శివపురం, బ్యాంక్ కాలనీ, ప్రశాంతి నగర్, శారదానగర్, వెంకునాయుడుపేట తదితర ప్రాంతాలలో ఖాళీ స్థలాలలో నీరు నిల్వ ఉండి పోవడంతో దోమలు అధికమయ్యాయి. 22వ వార్డు వెంకునాయుడుపేటలో గత నాలుగు రోజులుగా డోర్ టు డోర్ చెత్త సేకరణ జరగడం లేదు. చెత్తాచెదారం పేరుకు పోవడం వల్ల పారిశుధ్య సమస్య ఇబ్బందిగా మారింది. మునిసిపల్ అధికారులు దోమల నివారణా చర్యలు చేపట్టక పోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రతీ నెలా జరిగే కౌన్సిల్ సమావేశంలో అధికార, విపక్ష కౌన్సిలర్లు నర్సీపట్నంలో క్షీణించిన పారిశుధ్యం, దోమల బెడద మీద అధికారులపై దుమ్మెత్తి పోస్తున్నా మార్పు రావడంలేదని విమర్శలుఉన్నాయి. నెలలో ఒకరోజు కూడా దోమల మందు పిచికారి చేయడం లేదు. ప్రజలు మస్కిటో కాయిల్స్ మస్కిటో బ్యాట్లు వంటివి ఉపయోగించి తాత్కాలికంగా దోమల బారి నుంచి ఉపశమనం పొందుతున్నారు. మునిసిపల్ అధికారులు తక్షణమే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తట్టబందలో పరిశుభ్రత



కాలువలో పూడికలు తీస్తున్న సిబ్బంది

రావికమతం, జూలై 3 : మండలంలోని తట్టబంద పంచాయతీలో సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా గ్రామంలో పారిశుధ్య పనులు చేట్టాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీలో ఆరు శివారు గ్రామాలలో డ్రైనేజీలు, తుప్పలతో పాటు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగిస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలను తొలగించి, వాడుక నీరు ఎక్కడ నిల్వ లేకుండా చిన్న చిన్న గుంతలను పూడ్చి వేస్తున్నామని సర్పంచ్ రమణ తెలిపారు. పంచాయతీలో నిధులు లేకపోయినప్పటికీ ప్రజా ఆరోగ్యానికి ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలి

» ఎంపీడీవో ఉమామహేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

చీడికాడ, జూలై 3 : జాతీయ ఉపాధి హామీ పథకంలో 23 పంచాయతీల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యమి వ్వాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఉపాధి పథకం వీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో సియ్యాద్రి నాగరాజు మాట్లాడుతూ చీడికాడ మండలంలో 150 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం లక్ష్యం కాగా, 90 ఎకరాల్లో వేయడానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ముందుగా 75 ఎకరాల్లో పండ్లతోటలకు శాంక్షన్ అయ్యాయని తెలిపారు.ఈ తోటల పెంపకానికి మొక్కలు, ఎరువులు, గోతులుతవ్వుకునేందుకు మూడు సంవత్సరాలపాటు మొక్కల సంరక్షణకు అన్నీ ఉచితంగా ప్రభుత్వం నిధులు అందజేస్తుందని అన్నారు. దీనికి వీఆర్పీలు అందరూ రైతుల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు బిఎన్.పాత్రుడు, కె.ఎర్రునాయుడు, మహేష్ పాల్గొన్నారు.

ఆస్తి కోసం ఘాతుకం

... 3వ పేజీ తరువాయి

బుధవారం సతీశ్‌కుమార్ ఇంటిని పరిశీలించారు. క్లూస్ బృందం ఆధారాలు సేకరించి అనుమానం వ్యక్తం చేసింది. దీంతో అనుమానితులను పోలీసులు విచారించారు.ఈ క్రమంలో వరుసకు తమ్ముళ్లే అతనిని హత్య చేశారన్న విషయం వెలుగులోకి వచ్చింది. గత నెల 27వ తేదీన సతీశ్‌కుమార్‌కు వరుసకు తమ్ముళ్లు అయిన సాయి మనోజ్‌కుమార్, డి.రాజేశ్‌లు అతని ఇంటికి వెళ్లారు. సతీశ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగి ఛాతీ, ముఖంపై పిడి గుద్దులు గుద్ది హత్య చేశారు. అదే రోజు రాత్రి అతని మృతదేహాన్ని కారులో ఎక్కించి ఎస్.రాయవరం మండలం దార్లపూడి సమీపంలోని పోలవరం కాలువ వద్ద నిర్మిస్తున్న ఆక్విడెక్టు కింద నిర్జీవ ప్రదేశంలో గోతిలో పూడ్చి పెట్టారు. సాయి మనోజ్‌కుమార్, డి.రాజేశ్‌లు పోలీసు విచారణలో నేరాన్ని అంగీకరించడంతో వారి ద్దర్నీ తీసుకుని మృతదేహాన్ని పూడ్చిన ప్రదేశానికి అధికారులు చేరుకున్నారు. ఎస్.రాయవరం తహసీల్దారు విజయలక్ష్మి, వీఆర్వో, మృతుని కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని గుర్తించడంతో శవ పంచనామా పూర్తి చేసి మృతదేహాన్ని వారికి అప్పగించారు. నిందితులను అరెస్టు చేశారు. ఆస్తి తగాదాలే ఈ హత్యకు కారణమై ఉండవచ్చని సీఐ గఫూర్ తెలిపారు.

రెవెన్యూ గ్రామం యూనిట్‌గా వ్యవసాయ గణన

» తహసీల్దార్ రవిచంద్ర



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రవిచంద్ర

రోలుగుంట, జూలై 3 : భూ కమతాల వారీగా రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని వ్యవసాయ గణన కార్యక్రమాన్ని చేపట్టాలని వీఆర్వోలను తహసీల్దార్ రవిచంద్ర స్పష్టం చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ గణనపై అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలో వ్యవసాయ పద్ధతులను తెలుసుకోవడంతో పాటు అభివృద్ధి ప్రణాళిక సామాజిక ఆర్థిక విధాన రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లకోసారి వ్యవసాయ గణన నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ వ్యవసాయ గణన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. రైతుల వారీగా ఏయే పటలు సాగు చేస్తున్నారు, సాగు విస్తీర్ణం, నీటి వినియోగం, వ్యవసాయానికి ఏయే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి, సాగునీటి వనరుల వివరాలు, వ్యవసాయ సంబంధింత వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. నెల రోజుల పాటు రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించే ఈ గణనలో వీఆర్వోలు పాల్గొని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శేఖర్, ఆర్ఐ రామమూర్తి, ఏఎస్‌వో అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో పారిశుధ్య పనులు



పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సుజాత, కార్యదర్శి శ్రీను

కృష్ణాదేవిపేట, జూలై 3 : మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో ముమ్మర పారిశుధ్య పనులు చేపట్టారు. గురువారం అల్లూరి జయంతిని పురష్కరించుకుని ప్రముఖులు విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా రోడ్డుకు ఇరువైపులా చెత్తకుప్పలు, మురుగునీటి కాలువల్లో పూడికల తొలగింపు తదితర పారిశుధ్య పనులు చేట్టారు. దీంతో గ్రామంలో గత కొన్నాళ్లుగా నెలకొన్న అపరిశుభ్రత సమస్య కొంత వరకు తీరిందని ప్రజలు అంటున్నారు.

శ్రీసత్యనారాయణ స్వామి దేవస్థానం భూములకు కౌలు వేలం పాట



కౌలు వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

రోలుగుంట, జూలై 3 : కంచుగుమ్మల రెవెన్యూ పరిధిలో వాయిదా పడిన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ దేవదాయ, ధర్మదాయ భూములకు సంబంధించి బహిరంగ వేలం పాటను బుధవారం కార్యనిర్వహణాధికారి ఆశా కిరణ్మయి నిర్వహించారు. ఆ శాఖ ఉద్యోగి భాస్కరాచారి ఈ రెవెన్యూకు చెందిన 18, 19, 21/2 సర్వే నెంబర్లలో గల 3.48 ఎకరాలకు సంబంధించి నియమ నిబంధనలను చదివి వినిపించారు. వేలంపాటలో ఆరుగురు పాటదారులు పాల్గొనగా, కంచుగుమ్మల గ్రామానికి చెందిన పరవాడ పార్వతి ఏడాదికి రూ.13 వేలకు అధికంగా పాడి పాటను దక్కించుకున్నారు. పాట పాడుకున్న పార్వతికి మూడేళ్లపాటు ఆమె ఆధీనంలో ఉంటుంది. వేలంపాట పర్యవేక్షణ అధికారిగా బలిఘట్టం గ్రూపు టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి కె.దివ్యతేజ వ్యవహరించగా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి అల్లూరి

... 3వ పేజీ తరువాయి

వివిధ ప్రదేశాలకు వెళ్లి నివసించాల్సి వచ్చింది. దీంతో తండ్రి మరణం సీతారామరాజు విద్యపై తీవ్ర ప్రభావం చూపింది.

తొలి స్థావరం కృష్ణాదేవిపేట..

సీతారామరాజు తొలి స్థావరం కృష్ణాదేవిపేటగా ఏర్పర్చుకున్నాడు. కృష్ణాదేవిపేటలో చిటికెల భాస్కరనాయుడు ఆశ్రయం కల్పించాడు. 1917లో స్నేహితుడు పేరిచర్ల సూర్యనారాయణతో కలిసి కాషాయ వస్త్రాలు ధరించి కృష్ణాదేవిపేటలో నీలకంఠేశ్వరుని ఆలయంలో మకాం పెట్టాడు. అక్కడ ఉంటూనే ఆదివాసీలపై బ్రిటీష్ పాలకుల దురాగతాలు, అకృత్యాలను తెలుసుకుని రగిలిపోయాడు. అదే సమయంలో బ్రిటీష్ పాలకులపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఆదివాసీలకు కూలి చెల్లింపులో అన్యాయంపై లేఖ

లంబసింగి ఘాట్ రోడ్డు నిర్మాణంలో పనిచేస్తున్న గిరిజనులకు చెల్లించే కూలీలో చింతపల్లి తహసీల్దార్ బాస్టియన్ అన్యాయం చేయడంపై బ్రిటీష్ పాలకులకు సీతారామరాజు లేఖ రాశాడు. చింతపల్లి తహసీల్దార్ బాస్టియన్ అత్యంత క్రూరుడు. నర్సీపట్నం నుంచి లంబసింగి వరకు రోడ్డు మార్గం నిర్మించే కాంట్రాక్టరుతో కుమ్మక్కై గిరిజనులకు ఆరు అణాలకు బదులుగా రెండు అణాలు మాత్రమే చెల్లించేవాడు. ఎదురు ప్రశ్నించిన ఆదివాసీలను కొరడాలతో కొట్టించేవాడు. దీనిపై సీతారామరాజు అధికారులకు ఫిర్యాదు చేసినా బ్రిటీష్ పాలకులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తనపై ఫిర్యాదు చేశాడనే కోపంతో బాస్టియన్.. సీతారామరాజు గిరిజనులను కూడగట్టి విప్లవం తీసుకు వచ్చేందుకు సన్నాహాల్లో ఉన్నాడని బ్రిటీష్ ప్రభుత్వానికి లేఖ రాశాడు. దీంతో సీతారామరాజును కొన్నాళ్లు అడ్డతీగల సమీపం పైడిపుట్టిలో, నర్సీపట్నంలో అధికారుల కనుసన్నల్లో బ్రిటీష్ ప్రభుత్వం ఉంచింది. బ్రిటీష్ ప్రభుత్వ ఉద్యోగి ఫజులుల్లాఖాన్ సీతారామరాజును చాలా అభిమానించి సహాయం చేసేవాడు. దీంతో ఫజులుల్లాఖాన్‌కి తిరుగుబాటు చేయనని సీతారామరాజు మాట ఇచ్చాడు. ఈ మాటకు ఆయన కట్టుబడి ఉన్నాడు. 1922 జూలై 27న ఫజులుల్లాఖాన్ ఆకస్మికంగా మరణించాడు. దీంతో సీతారామరాజు ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. గిరిజన ప్రాంతంలో అడుగుపెట్టి గంటం దొర, మల్లుదొర, మొట్టడం వీరయ్యదొర, కంకిపాటి ఎండుపడాల్, సత్యనారాయణరాజు, అగ్గిరాజు, గోకిరి ఎర్రేసుతో సహా 150 మంది గిరిజనులను బ్రిటీష్ పాలకులపై పోరాటానికి సిద్ధం చేశాడు. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి సాయుధ పోరాటానికి సిద్ధపడి చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడికి నిర్ణయం తీసుకున్నారు.

చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడితో సాయుధ పోరాటం

అల్లూరి సీతారామరాజు తన అనుచరులతో తొలిసారిగా 1922 ఆగస్టు 22న చింతపల్లిపై దాడి చేసి సాయుధ పోరాటానికి నాంది పలికాడు. స్టేషన్‌లో 11 తుపాకులు, 5 కత్తులు, 1,390 తుపాకీ గుళ్లు, 11 బాయినెట్లు స్వాధీనం చేసుకున్నారు. తాను స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను రికార్డులో నమోదు చేశాడు. అదే క్రమంలో 23వ తేదీన కృష్ణాదేవిపేట, 24న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లపై దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాడు. సీతారామరాజు పోరాటంలో అత్యంత సాహసోపేతంగా అక్టోబర్ 15న అడ్డతీగల పోలీస్ స్టేషన్‌కు ముందుగా సమాచారం ఇచ్చి మరీ దాడి చేశారు. అదే నెల 19న రంపచోడవరం పోలీస్ స్టేషన్‌ను పట్టపగలే ముట్టడించి మొదటి దశ విప్లవానికి శ్రీకారం చుట్టారు. అదే ఏడాది డిసెంబర్ 6 నుంచి రెండోవ దశ ఉద్యమాన్ని ప్రారంభించిన సీతారామరాజు బ్రిటీష్ పాలకులను ముప్పతిప్పలు పెట్టాడు.

ఉద్యమం అణచివేతకు రూథర్‌ఫర్డ్ నియామకం

సీతారామరాజు ఉద్యమాన్ని అణచివేసేందుకు 1924 ఏప్రిల్ 17 మన్యానికి కలెక్టర్‌గా రూథర్‌ఫర్డ్‌ను నియమించారు. అతనికి విప్లవాలను అణచివేయడంతో నిపుణుడిగా పేరుంది. ఆయన కృష్ణాదేవిపేటలో సభను ఏర్పాటుచేసి వారం రోజుల్లో విప్లవకారుల ఆచూకీ తెలియకపోతే ప్రజలను కాల్చివేస్తామని హెచ్చరించాడు. ఈ విషయం తెలుసుకున్న సీతారామరాజు అదే ఏడాది మే 7న తాను ఉన్న ప్రాంతాన్ని పశువుల కాపరి ద్వారా పోలీసులకు చేరవేసి మంప చెరువులో స్నానంచేస్తూ పట్టుబడ్డాడు. ఎటువంటి విచారణ లేకుండా అల్లూరి సీతారామరాజును కొయ్యూరులోని చింతచెట్టుకు కట్టి గుడాల్ కాల్చిచంపాడు. 8వ తేదీన సీతారామరాజు దేహాన్ని ఫొటో తీయించి కృష్ణాదేవిపేటలో దహనం చేశారు.

అల్లూరి నడయాడిన చోట పార్కు ఏర్పాటు

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో మన్యం విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నడయాడిన చోట స్మారక మందిరం(పార్కు)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అల్లూరితో పాటు గంటందొర సమాధులను నిర్మించి, గ్రానైట్ రాళ్లతో తాపడం చేశారు. పార్కు చుట్టూ ప్రహరీ గోడ, సమాధులున్న ప్రదేశంలో నీడ కోసం భవనం నిర్మించారు. ఆ స్మారక మందిరాన్ని నిత్యం ఎంతో మంది సందర్శిస్తుంటారు.

సంక్షిప్తంగా..

7 నుంచి జగన్నాథ దశావతారాలు

చోడవరం, జూలై 3 : ఈ నెల 7 నుంచి స్థానిక జగన్నాథస్వామి అవతార దర్శనాలు ప్రారంభం కానున్నాయని కేశవస్వామి ఆలయ ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు తెలిపారు. ఈ నెల 5న శ్రీకేశవ స్వామి దేవాలయంలో జగన్నాథస్వామి పునఃప్రతిష్ట చేపడుతున్నామని, అనంతరం 18 వరకూ జగన్నాథస్వామి దశావతార దర్శనాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జగన్నాథస్వామి ప్రతిష్ట, దశావతార దర్శన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సుదర్శన సీతారామాచార్యులు కోరారు.

6న పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

మాడుగుల రూరల్, జూలై 3 : పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. ఈ నెల 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. రేబిస్ వ్యాధి అతి సూక్ష్మాతి సూక్ష్మమైన సూక్ష్మ జీవిగా సంక్రమిస్తుందన్నారు. మనుషులను లేదా జంతువులను ఈ వ్యాధి సోకిన కుక్కలు కరిచినపుడు ఈ వ్యాధి సంక్రమిస్తుందని, ఈ వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు. మాడుగుల, చీడికాడ మండలాల్లో గల పశు వైద్యశాలల్లో టీకాలు ఉచితంగా వేస్తారని తెలిపారు. ఈ టీకా బయట కొన్నట్లయితే సుమారుగా రూ.150 ఖర్చు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని పెంపుడు కుక్కలున్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈపీడీసీఎల్ యాప్ ద్వారానే విద్యుత్ బిల్లుల చెల్లింపు

» ఏడీఈ కుమార్‌గౌరీ వర ప్రసాద్

చోడవరం, జూలై 3 : ఏపీ ఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశాన్ని వినియోగదారులు ఉపయోగించుకోవాలని స్థానిక ఈపీడీసీఎల్ ఏడీ ఈయు కుమార్ గౌరీవరప్రసాద్ బుధవారం తెలిపారు. ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా లేదా, మొబైల్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా బిల్లులు సురక్షితంగా చెల్లించుకోవచ్చన్నారు. ఇకపై ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర మొబైల్ యాప్‌లలో ఈపీడీసీఎల్ పేరు కనిపించే అవకాశం లేదని, పూర్తిగా ఈపీడీసీఎల్ మొబల్ యాప్ ద్వారానే వినియోగదారులు ఈ బిల్లులు చెల్లించాలన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి సంస్థ మొబైల్ యాప్ ఈస్టర్న్ పవర్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించే అవకాశం ఉందని ఏడీఈ గౌరీవరప్రసాద్ వివరించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చోడవరం, జూలై 3 : మండల పరిధిలోని దామునాపల్లి ఫీడర్ నిర్వహణ పనులు చేపడుతున్నందున, ఈనెల5న దామునాపల్లి, మైచర్లపాలెం తదితర పంచాయతీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఈపీడీసీఎల్ ఏఈఈ రాజు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ స్పష్టం చేశారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్



ఎంపీడీవో అప్పలరాజు

దేవరాపల్లి, జూలై 3 : శారీరక వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ కోసం సదరం స్లాట్ బుకింగ్‌లు మీసేవా కేంద్రాల్లో గురువారం నుంచి నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ ఒక ప్రకటన విడుదల చేసిందన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో, మీసేవా కేంద్రాల్లో ముందుగా స్లాట్లు బుక్ చేసుకోవాలన్నారు.

రేషన్ సరఫరా విధానం తనిఖీ



రేషన్ సరఫరాను పరిశీస్తున్న సీఎస్‌టీడీ ఈశ్వరరావు

మాకవరపాలెం, జూలై 3 : లబ్ధిదారులకు అందరికి రేషన్ సరుకులు సకాలంలో అందజేయాలని సీఎస్‌టీడీ ఈశ్వర్‌రావు అన్నారు. బుధవారం ఆయన లచ్చన్నపాలెం, తామరం గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల బియ్యం పంపీణి వ్యాన్ ద్వారానే జరుగుతుందన్నారు. వచ్చే నెల నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ పంపిణీ ఉంటుందని తెలిపారు. ఈ నెల బియ్యం ఒక్కటే పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, జూలై 3 : నిరంతరం విద్యుత్ సరపరాను ఇచ్చే క్రమంలో మండల కేంద్రం 33- 11 కె.వీ పనులు చేయడానికి ఈనెల ఐదున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరపరాను నిలుపుదల చేస్తున్నట్లు నర్సీపట్నం ఈఈ రామకృష్ణ, ఏఈఈ కర్రి శంకరరావు బుధవారం తెలిపారు. దేవరాపల్లి, కాశీపురం, పెదనందిపల్లి, చిననందిపల్లి, నాగయ్యపేట, తామరబ్బ,చింతలపూడి, తెనుగుపూడి, వెంకటరాజపురం, పినకోట, పెదకోట, శ్రీరాంపురం, వాలాబు గ్రామాలకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వారు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

పంచాయతీ కార్యదర్శి చీపురుపల్లి నాయుడు

మాడుగుల, జూలై 3 : మాడుగులలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి చీపురుపల్లి నాయుడు తెలిపారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తచెదారం తొలగించడంతో పాటు డ్రైనేజీలు శుభ్రపర్చడం జరుగుతుందన్నారు. అలాగే సోమ, గురువారాల్లో జరిగే వారపుసంత కారణంగా ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్లకు ఇరువైపులా దుకాణాలు లేకుండా దూరంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే పంచాయతీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వంటి వాటిపై దృష్టి సారించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.